క్లుప్తంగా

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదు



నున్న(విజయవాడరూరల్): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులైన వారిచే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం నున్న గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి. గౌతం రెడ్డిని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు. ఏదైన డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, దండు సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారిణి ఎస్.భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో లెర్నింగ్ ప్రోగ్రాం



గన్నవరం రూరల్: మండలంలోని చినఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సోమవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యాన 'మై భారత్ ఎక్స్‌పీరియన్స్ లెర్నింగ్ ప్రోగ్రాం జరిగింది. దీనిలో భాగంగా సిద్ధార్థ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 13 మంది విద్యార్థులతో హాస్పిటల్‌లోని పలు విభాగాల్లో వైద్య సేవల పనులు చేయించారు. జిల్లా యూత్ అధికారి ఎస్. రాము మాట్లాడుతూ మై భారత్ కార్యక్రమం ద్వారా ది లెర్నింగ్ ప్రోగ్రాం ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులు నియమనిబంధనలు తెలుసుకుని పని చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ లెర్నింగ్ ద్వారా భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రోగ్రాం సమన్వయ సభ్యుడు బీవీ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలి

ఉంగుటూరు: ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కావున గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని అన్నారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా పశుపోషకులకు గెదెల షెడ్లు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందజేస్తున్న రాయితీని సద్వినియోగించుకోవాలని సూచించారు. వరద ముంపునకు గురైన ప్రతీ పంటకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తోందని, ఇంకా నష్ట పరిహారం అందనివారు ఉంటే మరల దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ విమల కుమారి తెలిపారు. సమావేశానికి కొంతమంది అధికారులు దుమ్మా కొట్టగా, మరికొందరు ఆలస్యంగా రావడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి అధికారులు రాకపోతే ఏవిధంగా పని చేస్తున్నారో తెలుస్తోందని అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ-2 చంద్రశేఖర్, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ అమీర్ బాషా, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము విడుదల

కంకిపాడు: మండల పరిధిలోని పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము విడుదల అయ్యిందని ఎంపీడీఓ పి. అనూష తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో 9,090 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరికి రూ. 3,80,17,000 నగదు విడుదలైందని పేర్కొన్నారు. ఈ సొమ్మును మంగళవారం సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

కొందరికే పరిహారం

- వీఎంసీ లే అవుట్ బాధితులకు దక్కని సాయం
- రేషన్ అరకొరగానే ఇచ్చారంటున్న బాధితులు
- పరిహారంలో అన్యాయం జరిగిందంటూ నిరసన



ఉప్పులూరు వీఆర్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

కంకిపాడు: వరద ముంపు పరిహారం అర్హులకు దక్కకుండా పోయింది. కూటమి నేతల ఒత్తిళ్లతో కొద్దిమందికే పరిహారం దక్కింది. వాస్తవంగా అర్హులైన తమకు అన్యాయం జరిగిందంటూ ముంపు బాధితులు ఆందోళన చెందుతున్నారు. పరిహారం అందించాలంటూ ఉప్పులూరు వీఆర్‌ఓ కార్యాలయానికి బాధితులు క్యూ కట్టారు.

బాధితుల జాబితాపై ఆరోపణలు

ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, బుడమేరు ఉధృతి, వన్నేరు పొంగిపొర్లటంతో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రధానంగా ఉప్పులూరు వీఎంసీ జగనన్న లే అవుట్, వన్నేరు కట్ట వెంబడి నివాసాల చుట్టూ నీరు చేరి ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. బుడమేరు ముంపు ప్రభావ ప్రాంతాలైన ఉప్పులూరు, మంతెన, తెన్నేరులో 1658 కుటుంబాలను అధికారులు నమోదు చేశారు. పూర్తి స్థాయిలో నమోదు జరగలేదని, అర్హతలు ఉన్న వారి పేర్లు జాబితాలో లేవని, అనర్హులకు, ముంపు ప్రభావం చూపని ప్రాంత వాసుల పేర్లు జాబితాలో ఉన్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ముంపు బాధితుల గోడు వర్ణనాతీతం

విజయవాడ పరిధిలోని రామలింగేశ్వరనగర్, బాలాజీ నగర్, పకీరుగూడెం, స్క్రూబ్రిడ్జి ప్రాంతాలకు చెందిన సుమారు 1600 మందికి ఉప్పులూరులో వీఎంసీ లే అవుట్ కేటాయించారు. ఇప్పటికే ఆ లే అవుట్‌లో 200 పైగా కుటుంబాలు నివాసాలు ఏర్పరచుకున్నాయి. తమను పలకరించిన వారే లేరని, పరిహారంలో అన్యాయం జరిగిందని బాధితులు ఆరోపించారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన రేషన్ సరుకులూ అన్ని ప్రాంతాలకు చేరలేదని చెబుతున్నారు. పాల ప్యాకెట్ దొరక్క రెండు వారాలు మురుగునీటిలోనే బతికామంటూ వాపోయారు. పరిహారం జాబితాలో తమ పేర్లు లేకపోవటంతో ఆందోళనకు గురయ్యారు. ముంపు ప్రభావంలేని ప్రాంతాల వారి పేర్లు జాబితాలో ఉన్నాయని, కూటమి నేతల ఒత్తిళ్లు పనిచేశాయని ఆరోపిస్తున్నారు. అర్హులైన తమకు న్యాయం చేయాలని, పరిహారం ఇప్పించాలంటూ ఉప్పులూరు వీఆర్‌ఓ కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీశారు.

న్యాయం చేస్తాం

వరద ముంపుతో నష్టపోయిన వారి పేర్లు జాబితాల్లో లేకపోతే మళ్లీ నమోదు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అర్హుల నుంచి పేర్లు నమోదు చేసి పూర్తి విచారణ చేస్తాం. అర్హులందరికీ పరిహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. బాధితులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. బాధితులకు అండగా ఉంటాం.

– వి.భావన్నారాయణ, తహసీల్దార్, కంకిపాడు

అర్హులకంటే అనర్హులే అధికం



వరదల కారణంగా మేము తీవ్రంగా నష్టపోయాం. ఏ ఒక్కరూ మా ఇబ్బందుల గురించి అడగలేదు. సరుకులు అందలేదు. పరిహారం అందించే జాబితాలో మా పేర్లు లేవు. నష్టపోయింది మేము. అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయి. అధికారులు మా ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిహారం అందేలా చూడాలి.

– పుసులూరి అనూరాధ, వీఎంసీ లే అవుట్, ఉప్పులూరు

సాయం అందలేదు



వన్నేరు పొంగడంతో మా ఇళ్లు నీట మునిగాయి. మాకు మాత్రం ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేదు. ముంపు బారిన పడకుండా ఉన్న వాళ్లకు మాత్రం మేలు జరిగింది. నష్టపోయిన మా కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలి.

– పెనుమత్స రాణి, ఉప్పులూరు

తప్పుల తడకగా జాబితా



విజయవాడ నుంచి వచ్చి ఇక్కడ ఉంటున్నాం. మా ఇళ్లకు వచ్చి మా బాగోగులు పట్టించుకున్న వాళ్లే లేరు. అదేమంటే విజయవాడ వాళ్లు అంటున్నారు. రేషన్ సరుకులు అందరికీ అందలేదు. ఇళ్ల చుట్టూ నీరు చేరి ఇబ్బందులు పడ్డాం. జాబితాలో మా పేర్లు లేవు. తప్పుల తడకగా జాబితా ఉంది.

– మహమ్మద్ సల్మా, కె.ధనలక్ష్మి, వీఎంసీ లే అవుట్

నష్టపోయాం ఆదుకోండి



బుడమేరు పొంగడంతో ఇళ్ల చుట్టూ నీరు చేరింది. రోజుల తరబడి బయటకు రాలేక, నీటి చెమ్మతో ఇళ్లు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం పరిహారం ఇస్తామని ప్రకటించింది. ఆ జాబితాలో మా పేర్లు లేవు. విజయవాడలో మీ పేర్లు ఉన్నాయేమో చూసుకోండి అంటున్నారు. ఇక్కడ ఉంటుంటే అక్కడ ఎలా ఉంటాయి. ప్రభుత్వం మాకు సాయం అందించాలి.

– ఊకోటి ధామసీత, వీఎంసీ లే అవుట్, ఉప్పులూరు

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఎస్పీ గంగాధరరావు



తాడిగడప జంక్షన్‌లో ట్రాఫిక్ అవుట్‌పోస్టు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ గంగాధరరావు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. తాడిగడప జంక్షన్‌లో సోమవారం ఆయన ట్రాఫిక్ అవుట్‌పోస్టు నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని కోరారు. రోడ్డు మార్జిన్‌ల్లో చిరు వ్యాపారులు వ్యాపారాలు చేయరాదన్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్, వెలగపూడి శంకర్‌బాబు, నర్రా చంటి, పీతా గోపిచంద్, రామ్‌కుమార్, పోలవరపు బాబి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మాంసం విక్రయాలు నిషేధం

పెనమలూరు: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో మాంసం విక్రయాలు చేయరాదని తాడిగడప కమిషనర్ భవానీప్రసాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ గాంధీ జయంతి రోజున మాంసం విక్రయాలు చేయరాదని తెలిపారు. ఎవరైన వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

కంకిపాడు: డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులకు విజయవాడ ఐదో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ. 10 వేలు జరిమానా విధించింది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కంకిపాడు పరిసరాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై అండర్ సెక్షన్ 185 ఎంవీ యాక్ట్ నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను సోమవారం విజయవాడ ఐదో అడిషినల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ. 10 వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారని తెలియజేశారు.

నేటి నుంచి జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 31వ తేదీ వరకు 90 రోజుల పాటు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న రోజుల్లో ముందస్తు పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, ధనకోటేశ్వరరావు

పెనమలూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పెనమలూరు పేరంటాళ్ల చెరువు వద్ద ఇళ్లు నీట మునిగిన 100 బాధిత కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నెస్లే కంపెనీ సహకారంతో డెప్యూటీ తహసీల్దార్ భవాని, మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్‌ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకుడు మారుపూడి ధనకోటేశ్వరరావు బాధితులకు ఉప్పు, కందిపప్పు, శనగపప్పు, పంచదార, బియ్యం, పచ్చిబఠాణి, నూనె ప్యాకెట్, పసుపు, కారం, మసాల ప్యాకెట్లు తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమేష్, భరద్వాజ్, టీడీపీ నేతలు తోటకూర ఉదయభాస్కర్, యలమంచిలి ప్రసాద్, కిలారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనలపై కేసు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో జరిగిన చోరీ ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ ఎస్ఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీలో ద్వారపూడి శివసత్యనారాయణ కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. అతను ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. కాగా అనారోగ్యంతో మచిలీపట్నం ఆస్పత్రిలో ఉన్న తన తండ్రిని చూడటానికి శివసత్యనారాయణ కుటుంబ సభ్యులతో సహా ఈనెల 28న మచిలీపట్నం వెళ్లాడు. అతను తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులకొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బంగారు 104 గ్రాములు, 150 గ్రాముల వెండి వస్తువులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాడిగడపలో బైక్ చోరీ

తాడిగడప రామానగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు బైక్ చోరీ చేయడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసుల కథనం మేరకు.. రామానగర్ కట్టకు చెందిన దాసరి రాజేష్ ఈనెల 26వ తేదీ రాత్రి తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేశాడు. అయితే అతను 27వ తేదీ ఉదయం చూసుకోగా ఇంటి ముందు ఉంచిన బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రజారవాణా బలోపేతమే లక్ష్యం

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మంత్రి కొల్లు రవీంద్ర

ఉయ్యూరు: ప్రజారవాణా బలోపేతమే తమ లక్ష్యమని ఆర్టీసీ నూతన చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో ఇటీవల మృతిచెందిన వల్లభనేని నాగ సత్య భానుమణి కుటుంబ సభ్యులను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి సోమవారం ఆయన పరామర్శించారు. భానుమణి కుమారులు భూషయ్య, చిట్టిలను యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ఉద్యోగ, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ..

స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. డీజేఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో గండిగుంటలోని దత్తాశ్రమంలో సోమవారం కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 150 మంది మహిళలకు మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు వెనిగళ్ల వెంకట కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్



విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులు తిలకిస్తున్న ఎంఈఓ శ్రీరాం బాలాసింగ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపకరిస్తాయని బాపులపాడు ఎంఈఓ శ్రీరాం బాలాసింగ్ అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ శ్రీరాం బాలాసింగ్ లాంఛనంగా ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో 'వేస్ట్ టూ ఆర్ట్' అంశంపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఆయా ప్రాజెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 'సేవ్ ద గర్ల్ చైల్డ్' అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై బాలికా సంరక్షణపై ఆసక్తికర ఉపన్యాసాలను ఇచ్చారు. ఎంఈఓ-2 బి. సురేష్‌కుమార్, బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.చలపతి, ఉపాధ్యాయులు జి. శ్రీనివాసరావు, ఎస్. లక్ష్మి, టి. గిరిజారమణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఓటర్ల నమోదు అధికారి

గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి షేక్ షహీద్‌బాబు నేతృత్వంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025లో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశంపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా షహీద్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గంలో 2,79,141 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని తెలిపారు. వీరిలో విజయవాడ రూరల్ మండలం -88,846, గన్నవరం మండలం-74,433, బాపులపాడు మండలం-72,025, ఉంగుటూరు మండలంలో 43,837మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ కె. వెంకటశివయ్య, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ ఎఎస్ఆర్. గోపాలరెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ భవాని, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు



పుస్తక సమీక్ష నిర్వహించి భావజాలాన్ని వివరిస్తున్న విద్యార్థిని

రామవరప్పాడు: పుస్తకాలు, గ్రంథాలు విజ్ఞాన భాండాగారాలు అని, విద్యార్థులు వాటిని చదవడం అలవాటుగా చేసుకోవాలని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి సూచించారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం పుస్తక సమీక్షకుల సంఘం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రథమ సీఎస్ఈ విద్యార్థిని పి.గీతిక 'గుడ్ వైబ్స్, గుడ్ లైఫ్' పుస్తకాన్ని సమీక్షించి సానుకూల భావజాలాన్ని విద్యార్థులకు వివరించారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ మంచి పుస్తకాల పఠనం ద్వారా తెలియని ఎన్నో విషయాలపై అవగాహన పెంపొందించుకోవచ్చునని అన్నారు. పరిపాలన అధికారి బొర్రా ప్రసాద్ మాట్లాడుతూ పుస్తక సమీక్షకుల సంఘం ద్వారా ముస్ముందు ఎన్నో విలువైన పుస్తకాల సమీక్షలను విద్యార్థులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. సాహిత్యంపై విద్యార్థులకు ఆశక్తి పెంపొందించడానికి పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. మురళీకృష్ణ, సాహిత్య క్లబ్ సమన్వయకర్త సుజిత్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్రానికి సంబంధించి ప్రశ్నాపత్రంతో కూడిన పుస్తకాలను సోమవారం అన్న సంతర్పణ సేవా సమితి ట్రస్టు అధ్యక్షుడు దిలీప్ పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు సులభతరంగా ఉండే ఈ భౌతిక రసాయన శాస్త్రం పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• రోడ్డుకు గండ్లు.. నడవవులెండి బండ్లు





నున్నలో ఆర్అండ్‌బీ రోడ్డుకు పెట్టిన గండ్లు

నున్న(విజయవాడరూరల్): విజయవాడ నగర శివారు ప్రాంతాలైన కండ్రిక, రాజీవ్‌నగర్ వరదల్లో ఉండటంతో ఆ నీటిని బయటకు పంపేందుకు నున్న గ్రామంలోని ఆర్అండ్‌బీ రోడ్డుకు అధికారులు అనేక చోట్ల గండ్లు పెట్టారు. అయితే వాటిని అలాగే వదిలేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పైపుల రోడ్డు నుంచి పాయకాపురం నగర సరిహద్దు వరకు రోడ్డుకు పెట్టిన గండ్లను పూడ్చటంతో పాటు సెంట్రల్ డివైడర్‌లో మొక్కల పెంపకానికి అవసరమైన గోడలను రిపేర్లు చేశారు. అయితే నగర సరిహద్దు వరకు గండ్లు పూడ్చిన అధికారులు అదే రోడ్డులోని మిగతా గండ్లు వదిలివేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి గండ్లు పూడ్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.